నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు
- పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- కూకట్‌పల్లి పరిధిలో 23 పరీక్షా కేంద్రాలు

కూకట్‌పల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి 25 వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షలకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఇంటర్‌మిడీయట్ విద్యాశాఖ అధికారులు తెలిపారు. విద్యార్థులకు తగు సలహాలు సూచనలు అందించారు. విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. జిల్లా వ్యాప్తంగా 150 కేంద్రాల్లో మంచినీరు. వైద్యసిబ్బందితో పాటు సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. 9 గంటలు దాటి వచ్చిన వారి కారణలు తెలుసుకుని అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. హాల్‌టికెట్‌లు ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

జిల్లా వ్యాప్తంగా ఇంటర్ మొదటి సవంత్సరం 62,829, వృత్తి విద్య మొత్తం 64,107 మంది పరీక్షలు రాయనున్నారు. ద్వితీయ సంవత్సరం 61,286 మంది, వృత్తి విద్య 1030 మొత్తం 62,316 పరీక్షలకు హాజరుకానున్నారు.

23 కేంద్రాలలో పరీక్షలు

కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో 23 కేంద్రాలలో ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయని కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌వో రాజేష్ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుదని, పరీక్షా కేంద్రలోకి విద్యార్థులు తప్ప ఎవరిని అనుమతించబోమన్నారు. ఇప్పటికే పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు కావాలని కోరినట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటామన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న ఆకుల పద్మ

జనసమితి కార్మిక విభాగం గ్రేటర్ హైదరాబాద్ శానిటరీ శాఖ ఇన్‌చార్జిగా ఆకుల పద్మ

హైదర్‌నగర్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జనసమితి కార్మిక విభాగం గ్రేటర్ హైదరాబాద్ శానిటరీ శాఖ ఇన్‌చార్జిగా కూకట్‌పల్లికి చెందిన ఆకుల పద్మ నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని తెలంగాణ జనసమితి వ్యవస్థాపకుడు కోదండరాం, రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కోదండరాంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మధ్యాహ్నం 3 గంటలకు కనిపిస్తున్న చెత్తకుప్పలు,
నాలుగు గంటల సమయంలో చెత్తకుప్పలు తొలగించిన సిబ్బంది

గంటలోనే చెత్త తొలగించిన సిబ్బంది

కూకట్‌పల్లి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చెత్త పారవేయడంలో జనాల్లో మాత్రం ఇంకా మార్పు రావడం లేదు. ఒక వైపు కూకట్‌పల్లి మున్సిపల్ శానిటేషన్ అధికారులు రోడ్లపై చెత్తవేయరాదు ఇంటింటికి వచ్చిన చెత్త వాహనాల్లో వేయాలని సూచిస్తున్న కొందరు పెడచెవిన పెడుతున్నారు. రోడ్లపైనే చెత్తను వేస్తున్నారు. మంగళవారం కూకట్‌పల్లి పరిధిలోని జెనిసిస్ పాఠశాల సమీపంలో మధ్యహ్నం 3 గంటల సమయంలో చెత్త కుప్పలు కనిపించడంతో వెంటనే కూకట్‌పల్లి శానిటేషన్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్ రావుకు సమాచారం ఇవ్వండంతో వారు వెంటనే స్పందిచారు. సమాచారం అందుకున్న గంటలోనే చెత్త కుప్పలను పూర్తిగా తొలగించారు. పరిసర ప్రాంతాలని పారిశుధ్య సిబ్బందిచే పరిశుభ్రం చేయించారు. సమాచారం అందుకున్న గంటలోనే పారిశుధ్య సమస్య పరిష్కరం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

కూకట్‌పల్లి ఎస్‌హెచ్‌వో ఎవరు?

- వెబ్‌సైట్‌లో ఒకరి పేరు.. స్టేషన్‌లో మరొకరి పేరు..!

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వో ఎవరు? సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ వెబ్‌సైట్‌లో ముత్తు, పోలీస్ స్టేషన్‌లో రాజేష్ ఏంటి ఇది! గత నెల 10న బదిలీపై పెనుగొండ్ల రాజేష్ ఎస్‌హెచ్‌వో (స్టేషన్ హౌజ్ ఆఫీసర్)గా బాధ్యతలు తీసుకున్నారు. కానీ నేటికి గతంలో పనిచేసిన ముత్తు పేరునే వెబ్‌సైట్‌లో కనిపిస్తోంది. ఎస్‌హెచ్‌వోతో పాటు మరో ఇద్దరు ఎస్సైలు బదిలీపై రాగా వారి పేర్లు కనిపించడం లేదు. టెక్నాలజీ వాడుకుంటూ దొంగలను, సైబర్ మోసానాలను చేధిస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. పోలీస్‌స్టేషన్ బాధ్యుల వివరాలను అప్‌డేట్ చేయడంలో నిర్లక్ష్యం ఎందుకు? అసలు ఐటీ డిపార్ట్‌మెంట్ పనిచేస్తుందా? టెక్నాలజీని పౌరులకు చేరువ చేయాల్సిన పోలీస్ ఉన్నతాధికారులు వెబ్‌సైట్‌లో అపడేట్స్‌పై దృష్టిపెట్టకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా మార్పు చేర్పులతో కూడిన ఎస్‌హెచ్‌వో, ఎస్సైల జాబితా మార్పుతారని ఆశిద్దాం.

కాలనీల్లో వారానికో సంత



సంతలో ఆకుకూరలు అమ్ముతున్న వ్యాపారులు



సంతలో ఫలాల రాసులు

వర్కింగ్ ఉమెన్‌కు ఎంతో ఉపయోగకరం



నేను కార్పొరేట్ ఉద్యోగిని, మేము కల్యాణ్‌నగర్‌లో ఉంటాము. తాజా కూరగాయల కోసం ఎర్రగడ్డ రైతుబజారుకు వెళ్లటానికి సమయం సరిపోదు, అందుకే ప్రతి సోమవారం రాజీవ్‌నగర్‌లో జరిగే సంతలో ఆకు కూరలూ, పండ్లు కొంటాను. కూరగాయలు ఫ్రెష్‌గా సరసమైన ధరలలోనే విక్రయదార్లు ఇస్తారు.

- శ్రీదేవి, కార్పొరేట్ ఉద్యోగి, మోతీనగర్

సంక్షేమ పథకాలు అందించాలి



వారాంతపు సంతలతో వ్యాపారులకు ఎంతో ప్రయోజనంగా ఉంది. ప్రభుత్వం అందరికి తగిన గుర్తింపునిచ్చి సంక్షేమ పథకాలతో అందరినీ ఆదుకుంటే బాగుంటుంది. వారం మొత్తం ఒక్కో రోజు ఒక్కో కాలనీలో ఇలా అడ్డా ఏర్పాటు చేసుకుని విక్రయిస్తాం.

- కృష్ణ, విక్రేతల సంఘం నాయకుడు

సరసమైన ధరలకు తాజా కూరగాయలు

అల్లాపూర్, మార్చి 4, (ఆంధ్రజ్యోతి): పూర్వం పల్లెల్లోని ప్రజలకు నిత్యావసరాలకోసం టౌన్లకు, పట్టణాలకు వెళ్లి తెచ్చుకునే చేవారు. కాస్త పెద్ద ఊరైతే వారానికొకసారి సంతలుండేవి. ఆ సంతలోనే వారికి కావలసిన ఉప్పు, పప్పు మొదలుకొని అవసరాలకు ఉపయోగపడే వస్తువులు దొరికేవి. 'హిస్టరి రిపీట్స్' అన్న చందంగా ఇప్పుడా సంస్కృతి హైదరాబాద్ సిటీలో పునరావిర్భవించింది. అల్లాపూర్ డివిజన్‌లోని పలు కాలనీలైన గాయత్రీనగర్, శ్రీ వివేకానంద నగర్, సెంట్రల్ అల్లాపూర్, అలాగే మూసాపేట్ డివిజన్‌లోని అవంతీనగర్, మోతీనగర్, బాలాజీ స్వర్ణపురి కాలనీ ఇలా దాదాపు అన్ని కాలనీలకు దగ్గరలో వారంలో ఏదో ఒక రోజు సంతలు నిర్వహిస్తున్నారు. అటు విక్రయదారులకు మంచి గిరాకీ ఏర్పడటంతో పాటూ, ఇటు గృహిణులకు సరసమైన ధరలలో ఇంటికి కావల్సిన వస్తువులు, ఇంటికి చేరువలో లభించటంతో సంతలకు ఆదరణ పెరిగింది. భారీగా అద్దెలు కట్టుకుంటూ షాపును నడుపుకునే కన్నా ఇలా సంతలలో విక్రయింస్తూండటం లాభసాటిగా ఉందంటున్నారు విక్రయదారులు. అల్లాపూర్ పరిసర ప్రాంతాలలో మడిగెల కిరాయిలు భారీగా ఉండటమేకాక డిపాజిట్‌లు కూడా పెద్దమొత్తంలోనే చెల్లించాల్సి ఉంటుంది. అంత ఆర్థిక భారం కన్నా ఇలా వారాంతపు సంతలే మేలని విక్రయదారులు అనుకుంటున్నారు.



జీహెచ్ఎంసీ జారీ చేసిన గుర్తింపు కార్డు

తోట నుంచి సంతలోకి..

కొందరు రైతులు కూరగాలను తమ తోటల్లోంచి నేరుగా ఈ సంతకు తెచ్చి తాజాగా విక్రయిస్తారు. దాంతో మధ్యవర్తుల కమీషన్లు లేకపోవటమేకాకుండా పండించిన రైతుకు బాగా గిట్టుబాటవుతుంది. ఇటు కాలనీలవాసులకు నిలువ చేయకుండా తెచ్చిన తాజా కూరగాయలు అందటమేకాకుండా సూపర్ మర్కెట్ ధరలకన్నా తక్కువ ధనకే లభిస్తుండటంతో సంతలకు ఆదరణ పెరిగింది.



కళ్లు మిరుమిట్లు గొలిపే గిల్టు నగలు

చిల్లరతో ఇబ్బంది లేదు

డిజటల్ పేమెంట్స్‌తో కూరగాయలు కొనుగోలు (క్యాష్‌లెస్ పేమెంట్స్) ఒక్కోసారి మనం చిల్లర లేక ఇబ్బంది పడతూంటాం. కూరగాయలు కొనేటప్పుడు ఈ పరిస్థితి ఎక్కువగా ఎదురౌతుంది. సంతల్లో విక్రయదారులు ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా పేటీఎం, ఫోన్‌పే, గూగుల్ పే వంటి యూపీఐ యాప్స్‌తో చెల్లింపులు చేయించుకుని కూరగాయలు విక్రయిస్తున్నారు. ఇది కస్టమర్లకు కూడా సౌకర్యంగా ఉంది. దీంతో చిల్లర సమస్య లేకుండా పోయింది.

దొంగలు కూడా ఉంటారు..

కూరగాయలు చౌకగా లభిస్తాయని, ఏదో కొంత సమయమూ, కొంత డబ్బు ఆదా అవుతుందని గృహిణులు ఇలాంటి సంతల్లోకి వస్తే, ఇదే అదనుగా చేసుకుని ఆకతాయిలు, చిల్లర దొంగలు కాచుకుని ఉంటున్నారు. ఫోన్ దొంగతనాలు మామూలేనని, అప్పుడప్పుడూ ఒకరిద్దరు దొంగలను పట్టుకున్న సందర్భాలు కూడా ఉన్నాయని స్థానికులు అంటున్నారు. చైన్ స్నాచింగ్ వంటి నేరాలు కూడా గతంలో జరిగాయని అంటున్నారు.

చిరు వ్యాపారులకు ఉపాధి



వారాంతపు సంతో ప్రజలకు కూరగాయలు ఇతర నిత్యావసరాలు అందుబాటులో ఉన్నమాట పక్కనపెడితే, మాలాంటి చిరు వ్యాపారులకు ఉపాధి కలుగుతోంది.

- జాబెర్, చిరు వ్యాపారి, గాయత్రీనగర్ సంత

వ్యాపారులకు గుర్తింపు కార్డులు



చిరు వ్యాపారులకు స్ట్రీట్ హాకర్స్ గుర్తింపు కార్డులను జీహెచ్ఎంసీ జారీ చేసింది. అలా నమోదు చేసుకున్న విక్రేతలకు ప్రభుత్వ సంక్షేమ సథకాలలో తగిన ప్రాధాన్యత కల్పిస్తే బాగుంటుంది.

- నాగిళ్ల రాజి రెడ్డి, సమాజ సేవకుడు, జనప్రియ నగర్

గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా పేలుడు

- ఒకరికి తీవ్ర గాయాలు

హైదర్‌నగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని గ్యాస్ రీఫీల్లింగ్ సెంటర్లపై నిఘా లేకపోవడంతో ఇష్టారాజ్యాంగా రీఫీల్లింగ్ స్టేషన్‌లు నడుస్తున్నాయి. రాజస్థాన్‌కు చెందిన శంకర్ జగద్గిరిగుట్టలో నివాసం ఉంటూ కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధి వివేకానందనగర్ డివిజన్ బాగ్ అమీర్‌లోజయ భవాని గోల్డెన్ ఇన్ఫోసిస్టమ్ ఎలక్ట్రికల్ అండ్ గ్యాస్ సర్వీస్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. ఈ షాపులో గత ఏడాది నుంచి గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా గ్యాస్ సిలిండర్ రీఫిల్లింగ్ చేస్తు విక్రయాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం గ్యాస్ లీకేజీ అయి ఒక్కసారిగా భారీ పేలుడు జరిగింది. ఈ ఘటనలో శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గృహ అవసరాలకు వాడే సిలిండర్ల నుంచి చిన్నచిన్న వాటిలో అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా గ్యాస్ లీక్‌అయి ఒక్కసారిగా భారీ శబ్దంతో గ్యాస్ సిలిండ్ పేలుడు సంభవించింది. పేలుడు దాటికి షాప్ షట్టర్ చాలా దూరం వెళ్లిపడటం పేలుడు తీవ్రతకు నిదర్శనం. దీంతో చుట్టు పక్కల వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటల్లో 40 శాతం కాలిన గాయాలతో ఉన్న క్షతగాత్రున్ని గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జనవాసాల మధ్య ఇటువంటి రీఫిల్లింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.



గ్యాస్ రీఫీల్లింగ్ సెంటర్, పేలుడు దాటికి ఎగిరిపడ్డ షట్టర్



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న వినోద్‌కుమార్ గౌడ్ తదితరులు

బాలాజీనగర్‌లో సమస్యలు పరిష్కరించాలి: బీజేపీ

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బాలాజీనగర్ డివిజన్ పరిధిలో సమస్యలను పరిష్కరించాలని మంగళవారం మూసాపేట్ సర్కిల్ డీసీ వంశీకృష్ణకు వినతిపత్రం అందజేశారు. వీధి దీపాలు, పార్కుల్లో చెత్తాచెదారం, భూగర్భ డ్రైనేజీ, కేపీహెచ్‌బీ సర్వీసు రోడ్డులో ట్రాఫిక్ సమస్యల గురించి బీజేపీ డివిజన్ అధ్యక్షులు వినోద్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో డీసీని కలిసి విన్నవించారు. సంబంధిత అధికారులతో సమీక్ష జరిపి సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని డీసీ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సోమశేఖర్, భగవంత్, వేణుగోపాల్, సత్యనారాయణ, సంతోష్, ప్రేమ్, అర్జున్, జగదీష్, రేణుక తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జనసేన నాయకులు

జనసేన పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి: శంకర్ గౌడ్

హైదర్‌నగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో జనసేన పార్టీ అభివృద్ధి కోసం ప్రతి జన సైనికుడు కృషి చేయాలని జనసేన పార్టీ తెలంగాణ ఇన్‌చార్జి శంకర్‌గౌడ్ అన్నారు. కూకట్‌పల్లిలో మంగళవారం కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14న పిఠాపురంలో నిర్వహించనున్న పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి నగరం నుంచి జన సైనికులు పెద్దఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఉప ముఖ్యమంత్రి హోదాలో నిర్వహించనున్న సభను జయప్రదం చేయాలని కోరారు.

కల్వర్టు నుంచి దుర్వాసన.. ఇబ్బందుల్లో ప్రజలు



దుర్గంధం వెదజల్లుతున్న కల్వర్టు

నిజాంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధి అంబీర్ చెరువును ఆనుకుని ఉన్న శ్రీబాలాజీ కల్వర్టు నుంచి దుర్వాసన వెదజల్లుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని సామాజిక కార్యకర్త ఎస్. ఉదయ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. నాలాపై కేవలం రేకులను బిగించారు. దీని కారణంగా విపరీతమైన దుర్గంధం వెదజల్లుతోంది. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి ఫెన్సింగ్ వేసిన ప్రధాన రహదారి వరకు రేకులను కప్పి మరమ్మతులు చేస్తే బాగుంటుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ధ్వజస్తంబ ప్రతిష్ఠాపన వేడుకలో పాల్గొన్న కార్పొరేటర్ నర్సింహ యాదవ్

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం

బాలానగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ డివిజన్ పరిధి చరబండరాజూనగర్ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో సంకష్ట విజయగణపతి సహిత విజయదుర్గా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. మూడవ రోజు మంగళవారం జరిగిన వేద పారాయణం, కలశారాధన, దుర్గాహోమం పూజల్లో ఓల్డ్ బోయినపల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్, డివిజన్ బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కార్పొరేటర్ నర్సింహ యాదవ్, సీనియర్ నాయకులను పట్టు వస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ పూజల్లో కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ కాంగ్రెస్ నాయకులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. పూజల అనంతరం బండి రమేష్‌ను ఆలయ కమిటీ సభ్యులు సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

వాటర్‌ట్యాంకర్ డ్రైవర్ల ఆగడాలు..!

- రూ.150-200 అదనంగా తీసుకుంటున్న డ్రైవర్లు
- చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్న అధికారులు

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తి తీర్చడంలో అధికారులు విఫలం అవుతున్నారు. నల్లాల ద్వారా ఇవ్వాల్సిన నీటిని ట్యాంకర్ల ద్వారా అమ్ముకుంటున్నారు. వేసవి వచ్చిదంటే చాలు ట్యాంకర్ల డ్రైవర్ల ఆగడాలు మితిమీరుతున్నాయి. గృహ అవసరాల కోసం 5 వేల లీటర్లు ఉన్న ట్యాంకర్ రూ.500, వ్యాపార/వాణిజ్య కేంద్రాల కోసం రూ.850 ఉంది. కానీ ట్యాంకర్ వచ్చిదంటే సారూ రూ.150-200 వరకు ఎక్కువ ఇవ్వమంటున్నారని వాచ్‌మెన్‌లు సంబంధిత ఇంటి యజమాని లేదా అసోసియేషన్ సభ్యులకు సమాచాచారం ఇవ్వాల్సిందే. అదేంటి బాబూ అంటే ఏంటి సార్ మీకు తెల్వదా ఇస్తే మళ్లీ వస్తం లేదంటే ఇక మీకు నీళ్ల పోసే వారుండరని హెచ్చరించడం సర్వసాధారణమైంది.

నెలరోజులుగా ఇదే పరిస్థితి..

కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ డివిజన్ల పరిధిలో నీటి ట్యాంకర్ లేకుండా వసతి గృహాలు నడవవు. పెద్దపెద్ద అపార్ట్‌మెంట్లు సైతం ట్యాంకర్లపైనే ఆధారపడుతున్నారు. ఈ రెండు సెక్షన్ల పరిధిలోనే రోజుకు 350-400 ట్యాంకర్ల వరకు బుకింగ్‌లు వస్తున్నాయి. దీంతో అధికారులు సైతం ఈ మేరకు ట్యాంకర్లను సరఫరా చేస్తున్నా.. వినియోగదారుల అవసరాన్ని ట్యాంకర్ల డ్రైవర్లు క్యాష్ చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. కేపీహెచ్‌బీ ఒకటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరో రోడ్డులతో పాటు ధర్మారెడ్డికాలనీ ఫేజ్-1, టెంపుల్ బస్టాపు, భువన విజయం గ్రౌండ్, శ్రీసాయినగర్, సర్దార్‌పటేల్‌నగర్, ఐదోఫేజ్, ఏడోఫేజ్, తొమ్మిదోఫేజ్ వసతి గృహాలు, పీజీలతో రోజుకు ఒక్కో దానికి రెండు, మూడు ట్యాంకర్లు కూడా తెప్పించుకుంటున్నారు. జలమండలి నుంచి బుకింగ్ అయ్యే వాటికి కాస్త ధర తక్కువ కావడంతో దీనిపైనే అందరూ ఆధారపడుతుండగా దీన్నే జలమండలి సిబ్బంది క్యాష్ చేసుకుంటున్నారు. ప్రైవేటు వ్యక్తులు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఎవరి వాటా వారికి అందుతున్నాయట. డ్రైవర్లు అడిగింది ఇవ్వకపోతే మరోసారి బుకింగ్ చేసినా ప్రయోజనం ఉండదని, రూ.200 కూడా ఇవ్వలేరా అని తెగేసి చెప్పటం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. వాచ్‌మెన్‌లు, సంబంధిత కాలనీల అసోసియేషన్ నిర్వాహకులు చెప్పినట్లు ఆ ప్రాంతంలో నివాసితులు వినాలిసిందే. మేము మాట్లాడతాం కదా మేం చెప్పింది ఇచ్చేయండని చెప్పడం అవినీతి ఏ మేరకు జరుగుతుందో ఇట్టే అవగతం చేసుకోవచ్చు. జలమండలి నుంచి కాకుండా ఇతరత్రా ప్రైవేటు ట్యాంకర్లు బుకింగ్ చేద్దామంటే ఒక్కో ట్రాక్టర్ రూ.1000కు తక్కువ లేదు. దానికి తోడు మళ్లీ డ్రైవర్ సార్ అంటే రూ.100 ఇచ్చుకోవాల్సి వస్తుందని ఓ హాస్టల్ నిర్వాహకుడు తెలిపారు. దీంతో చేసేది లేక జలమండలి నుంచి సాధ్యమైనంత వరకు రోజు విడిచి రోజు ట్యాంకర్ బుకింగ్ చేసుకుంటున్నామని చెబుతున్నారు.

డ్రైవర్ డిమాండ్ చేసి రూ.150 తీసుకున్నారు.

తాగునీటిని కొనుక్కోని తాగాల్సిన దుస్థితి నెలకొంది. బల్క్ సప్లై ద్వారా నీటి సరఫరా తగ్గడంతో ట్యాంకర్లు బుకింగ్ చేసుకుంటున్నాం. మేము గృహ అవసరాల నిమిత్తం సొసైటీ ద్వారా బుకింగ్ చేయించుకొని ట్యాంకర్ తెప్పించుకున్నాం. ఎంత అంటే రూ.650 అన్నారు. ట్యాంకర్ రూ.500 కదా అంటే ఏంటి మీరు డబ్బులు ఇవ్వలేరా ? ఇస్తారా ? లేదా ? అని డిమాండ్ చేయడం ఆశ్చర్యం కలిగింది. ఇదే విషయమై మా కాలనీ సొసైటీ సభ్యుల దృష్టికి తీసుకెళ్లా మేము మాట్లాడతాం అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారే కానీ డ్రైవర్ తీరుపై మాట్లాడకపోవడం బాధ అనిపించింది. దీంతో జలమండలి ఎండీకి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశా. ప్రిన్సిపాల్ సెక్రటరీ, మేయర్, ఇతరత్రా ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లా.

- మెడెపూడి విజయభాస్కర్, భగత్‌సింగ్‌నగర్ ఫేజ్-1, కేపీహెచ్‌బీ



కేపీహెచ్‌బీ టెంపుల్ బస్టాపు సమీపంలో ఓ భవనంలో నీళ్లు పోస్తున్న వాటర్ ట్యాంకర్

ఫిర్యాదు అందితే ట్యాంకర్ సీజ్ చేస్తాం

ప్రతిరోజు మూడు ఫిల్లింగ్ స్టేషన్ల నుంచి ఉదయం 6 గంటల నుంచి రాత్రి 8.30 గంటల వరకు బుకింగ్ చేసుకున్న వారికి నీటి సరఫరా ట్యాంకర్ల ద్వారా చేస్తున్నాం. బోర్డు నిర్ణయించిన ధరలకు మించి ఒక్క రూపాయి డిమాండ్ చేసినా, తీసుకున్నా సదరు ట్యాంకర్‌ను సీజ్ చేస్తాం. డ్రైవర్ ప్రవర్తన సరిగ్గా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత సంబంధిత ట్యాంకర్ ఓనర్ తీసుకోవాలి. వినియోదారులు ఎవరైనా ట్యాంకర్ డ్రైవర్ల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటుంటే నేరుగా తనను కలిసి ఫిర్యాదు చేయవచ్చు. ఫోన్ నంబర్ 9154297408లో సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకుంటాం.

- శ్రీకాంత్‌రెడ్డి, కేపీహెచ్‌బీ సెక్షన్ మేనేజర్

ఇంజనీరింగ్ అధికారుల సమాచారం

కేపీహెచ్‌బీకాలనీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి, మూసాపేట్ సర్కిళ్ల పరిధిలో ఇంజనీరింగ్ పనుల కోసం అధికారులను వార్డు కార్యాలయాలు లేదా సర్కిల్ కార్యాలయాల్లో కలిసి విన్నవించవచ్చు. మీ వార్డు పరిధిలో ప్రధాన రోడ్లతో పాటు గల్లీల్లో రోడ్లు వేయలేదా? గుంతలు పడి ఉన్నాయా? రోడ్లపై నీరు నిలుస్తుందా? ఎవరైనా వ్యక్తిగత పనుల కోసం రోడ్లను తవ్వుతున్నారా? ఇలాంటివి ఏమి ఉన్నా ఫోన్‌లో కూడా అధికారులకు సమాచారం అందించి వాటికి పరిష్కారం ఎప్పటిలోగా చూపుతారో అడిగి తెలుసుకోవచ్చు.

కూకట్‌పల్లి సర్కిల్..

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డి. గోవర్ధన్ గౌడ్	- 9154299633.
డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్- జి.నిఖిల్ రెడ్డి	- 9701365524.
ఓల్డ్‌బోయిన్‌పల్లి, జి.ఆశా, ఏఈ	- 7331189482.
బాలానగర్, సీహెచ్ సునీల్ కుమార్, ఏఈ	- 7331170683.
కూకట్‌పల్లి, కె.సాయి ప్రసన్న, ఏఈ	- 7995007398.
వివేకానందనగర్, ఆర్.నిఖిల్, ఏఈఈ	- 9948152336.
డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆర్. రమేష్	- 9909732030.
హైదర్‌నగర్- సీలం రాజీవ్, ఏఈఈ	- 7995009083.
ఆల్విన్‌కాలనీ, ఎస్.శరవాణి, ఏఈ	-7337557252.

మూసాపేట్ సర్కిల్..

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, వనమల శ్రీనివాస్	- 9849906745.
డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, బానోత్ శంకర్	- 8897507965.
కేపీహెచ్‌బీ, సాయిప్రసాద్, ఏఈఈ	- 7995007405.
బాలాజీనగర్, శ్రీనివాస్, ఏఈ	- 7993360292.
అల్లాపూర్, ముడావత్ రంజిత్, ఏఈ	- 7337367270.
డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, స్రవంతి	- 9701362691.
మూసాపేట్, టీజం వర్షిణి, ఏఈఈ	- 9381121636.
ఫతేనగర్- పొడుగు రాధాకృష్ణ, ఏఈఈ	- 9703896873.

టీఎన్‌వోఓస్ కాలనీలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు



సెంట్రల్‌లైటింగ్ వ్యవస్థను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి డివిజన్ టీఎన్‌జీఓస్ కాలనీలో రూ.54లక్షల అంచనాతో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్‌ను కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీఎన్‌జీఓస్ కాలనీలో సెంట్రల్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడం ఆనందంగా ఉందన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి: ఎమ్మెల్యే గాంధీ

హైదర్‌నగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఆయా డివిజన్లలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో శేరిలింగంపల్లి సర్కిల్, చందానగర్ సర్కిల్, కూకట్‌పల్లి సర్కిళ్ల పరిధిలోని ఆయా డివిజన్లలో నెలకొన్న సమస్యలు, పరిష్కారాలు, చేపట్టే పలు అభివృద్ధి పనులతో ప్రజలు ఇబ్బందులను పరిష్కరించాలన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన పెండింగ్ పనులు త్వరలో పూర్తి చేయాలని, అభివృద్ధి కార్యక్రమాలపై అలసత్వం చేయవద్దని ఆదేశించారు. రోడ్లు, నాలా నిర్మాణ పనులు, పార్కుల్లో పెండింగ్‌లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నియోజకవర్గ అభివృద్ధికి అన్నివిభాగాల అధికారులు కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఈఈ దుర్గాప్రసాద్,కెవిఎస్ రాజు, గోవర్ధన్‌గౌడ్, డీఈలు ఆనంద్, విశాలక్ష్మి, దుర్గాప్రసాద్, రమేష్, నిఖిల్, ఏఈలు జగదీష్, భాస్కర్, ప్రతాప్, ప్రశాంత్, సంతోష్, సంతోష్‌రెడ్డి, శ్రావణి, సాయి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి

చందానగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని ప్రజలు ఉపయోగించుకొని లబ్ధిపొందాలని చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ పి.మోహన్‌రెడ్డి అన్నారు. సర్కిల్ కార్యాలయంలో బుధవారం టౌన్‌ప్లానింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనధికార ప్లాట్స్, లే అవుట్లు, క్రమబద్ధీకరణ కోసం ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించిందన్నారు. రాయితీలో కూడా 25 శాతం ప్రభుత్వం ప్రకటించిందన్నారు. 2020లో దరఖాస్తు చేసుకున్నవారు ఇప్పుడు క్రమబద్ధీకరించుకొనేందుకు అవకాశం ఉందన్నారు. మార్చి 31 వరకు క్రమబద్ధీకరించుకునే వారికి ఈ రాయితీ వర్తిసుందని తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించేందుకు హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ డెస్క్‌లో అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఏసీపీ నాగిరెడ్డి, టీపీఓ శ్రీనివాస్‌రెడ్డి న్యాక్ ఇంజనీర్లు, తదితరులు ఉన్నారు.

వెస్ట్‌జోన్‌కు అదనంగా 20 మంది క్లారికల్ సిబ్బంది

గచ్చిబౌలి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్‌కు అదనంగా 20 మంది క్లారికల్ సిబ్బంది బదిలీపై వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల గ్రూప్-4 పరీక్షలో పాసై ఉద్యోగాలు పొందిన వారు గత జనవరిలో ప్రధాన కార్యాలయంలో విధుల్లో చేరారు. రెండు నెలలుగా విధులు నిర్వహించి వెస్ట్‌జోన్ పరిధిలోని వివిధ సర్కిళ్లకు బదిలీపై వచ్చినట్టు జోనల్ ఉపేందర్‌రెడ్డి తెలిపారు. జోనల్ కార్యాలయానికి ఇద్దరు, శేరిలింగంపల్లి సర్కిల్‌కు-5, చందానగర్ సర్కిల్‌కు -5, రామచంద్రపురం, పటాన్‌చెరువుకు-4, యూసఫ్‌గూడకు-4 బదిలీపై పంపారు. శేరిలింగంపల్లి సర్కిల్‌లో ఐదుగురు బాధ్యతలు స్వీకరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మదీనగూడ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని ఆయన పేర్కొన్నారు.

6 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు

చందానగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియేట్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇంటర్ పరీక్షలు రాయడానికి బోర్డ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అన్ని సౌకర్యాలను కూడా ఆయా కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. విద్యుత్, తాగునీరు, సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేశారు. చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 6 కేంద్రాల్లో పరీక్ష రాయనున్నట్టు చందానగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి తెలిపారు.

'ఇంటర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి'

గచ్చిబౌలి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి మండలంలోని ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్నాయని ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. పదో తరగతి పరీక్షలు పూర్తికాక ముందే ఇంటర్ కళాశాలల యాజమాన్యాలు ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్నారని మండల ఏఐఎస్‌ఎఫ్ అధ్యక్షుడు నితీష్, కార్యదర్శి దర్మతేజ ఓ ప్రకటనలో తెలిపారు. కార్పొరేట్ కళాశాలలు విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తడి తీసుకొచ్చి అడ్మిషన్లు తీసుకోవాలని ఇబ్బందులు పెడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేసి విద్యార్థుల భవిష్యత్‌లో ఆటలు ఆడుతున్నారని ఇంటర్ మీడియేట్ బోర్డు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వసూళ్లే లక్ష్యం

- ఆస్తిపన్ను వసూళ్లలో వేగం పెంచిన అధికారులు
- శేరిలింగంపల్లి సర్కిల్‌ను ముందు వరుసలో నిలిపేందుకు కృషి

గచ్చిబౌలి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లలో ప్రతిఏటా శేరిలింగంపల్లి సర్కిల్ ముందువరుసలో ఉంటోంది. దీనిని ఈ ఏడాది కూడా అధికారులు నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. మార్చి 31తో ముగిసే ప్రస్తుత ఆర్థిక సంత్సరం ముగిసేలోపు అధికారులు ఇచ్చిన టార్గెట్‌ను అందిగమించేందుకు అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగానే ఆస్తిపన్నుల వసూళ్ల కోసం సర్కిల్ పరిధిలోని సీనియర్ అధికారులను, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్లు కలెక్టర్లు వారికి ఇచ్చిన ప్రాంతాల్లో ముమ్మరంగా తిరుగుతూ మొండి బకాయి దారుల నుంచి పన్నులు వసూలు చేస్తున్నారు. ప్రత్యేక కార్యచరణ రూపొందించుకొని ముందుకెళ్తున్నారు. వీరితో ఉపకమిషనర్ ముకుందారెడ్డి ఆధ్వర్యంలో నిత్యం సమీక్ష సమావేశాలు నిర్వహించి పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సర్కిల్ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యంగా రూ. 390.32 కోట్లుగా అధికారులు నిర్దేశించారు. సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు రూ.246.26కోట్లు వసూలు చేయడం జరిగింది. ఇదే ఊపుతో లక్ష్యం సాధించేందుకు అధికార యంత్రాంగం ముమ్మరంగా ప్రయత్నం చేస్తోంది.

ప్రత్యేక చర్యలు

గతేడాది మార్చి 31వరకు రూ.256.43కోట్లు పన్నులు వసూలు కాగా ఈ ఏడాది ఇప్పటికే రూ.245.26 కోట్లు వసూలు చేశారు. ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించి ఆస్తిపన్ను వసూళ్ల కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. డాకెట్ వారీగా ఎక్కువ బకాయిలు ఉన్న ప్రాంతాలను గుర్తించి బకాయి దారులకు నోటీసులు ఇవ్వడంతో పాటు వారి నుంచి పన్నుల వసూళ్లకు ఎప్పటికప్పుడు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆస్తిపన్ను చెల్లింపు దారులు బిల్లు కలెక్టర్‌గాని, ఆన్‌లైన్ ద్వారా, మీసేవా, సర్కిల్ కార్యాలయంలోని సిటిజన్ సర్వీస్ సెంటర్లలో చెల్లించవచ్చని అధికారులు చెబుతున్నారు. ఏదిఏమైనా లక్ష్యాన్ని చేధించేందుకు అధికార యంత్రాంగం ముమ్మరంగా పనిచేస్తోంది.



జీహెచ్‌ఎంసీజోనల్ కార్యాలయం

- శేరిలింగంపల్లి సర్కిల్‌లో ఉన్న వ్యాపారులు సకాలంలో తమ లైసెన్సులను రెవెన్యూవల్ చేసుకోవాలని ఏఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీకాంత్ వ్యాపారులకు పిలుపునిచ్చారు. సర్కిల్ పరిధిలో మొత్తం సుమారు 15 వేల ట్రేడ్ వ్యాపారులు లైసెన్సులు తీసుకున్నారని వారిలో 10వేల లైసెన్సులు మాత్రమే రెన్యూవల్ చేసుకున్నారు. రూ.30.50కోట్లు వసూలు చేయడం జరిగిందని మార్చి 31గడువుపూర్తి కావస్తున్న దృష్ట్యా తమ లైసెన్సులు రెన్యూవల్ చేసుకోవాలని తెలిపారు. గడువు పూర్తైతే అపరాద రుసుం పడుతుందన్నారు.

అభివృద్ధికి సహకరించండి

శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో ఆస్తి పన్ను చెల్లింపుదారులు, వ్యాపారులు సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఉపకమిషనర్ ముకుందారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. గడువు దాటితే అదనపు భారం పడుతుందని, భారం పడకుండా మార్చి 31లోగా పన్నులు చెల్లించాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి

పన్ను ఎగవేత దారులపై ప్రత్యేక దృష్టి

చందానగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పన్ను ఎగవేతదారులపై ప్రత్యేక దృష్టి సారించి వారెంట్లు జారీ చేయాలని చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ పి.మోహన్‌రెడ్డి అన్నారు. సర్కిల్ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి చెల్లించవాల్సిన పన్నును కొందరు కట్టకుండా ఉండడం సముచితం కాదని, అలాంటి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి టాప్ డిఫాల్టర్స్‌గా పరిగణించి వారెంట్స్ జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. నివాస భవనాలకు అనుమతులు పొంది కమర్షియల్ కార్యకలపాలకు పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎంసీ మహేందర్‌రెడ్డి, సూపరింటెడ్ కృష్ణ, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్లు కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి పనుల పరిశీలన

చందానగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనుల జాప్యంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జనసేన పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్.మాదవరెడ్డి అన్నారు. నమస్తే శేరిలింగంపల్లి కార్యక్రమంలో భాగంగా బుధవారం శేరిలింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జిని నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లింగంపల్లి అండర్‌బ్రిడ్జి వద్ద కొనసాగుతున్న నిర్మాణ పనుల జాప్యంతో ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రోజులుగా పనులు జరుగుతున్నాయి. దీంతో వాహనచోదకులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. చాకలి చెరువునుంచి వచ్చే మురుగు సాఫీగా వెళ్లేందుకు అవుట్‌లెట్ సరిగా లేకపోవడంతో నీరు బ్రిడ్జి కింద నిలువ ఉంటుందని తెలిపారు. వర్షాకాలంలో సమస్య మరింత తీవ్రంగా ఉంటుందని, జాప్యం లేకుండా త్వరగా పనులు పూర్తి చేసి ప్రజా రవాణను మెరుగుపర్చాలని అధికారులను కోరారు. నాయకులు తదితరుల పాల్గొన్నారు.



రైల్వే అండర్ బ్రిడ్జి పనులను పరిశీలించిన జనసేన నాయకులు

మార్తాండ్‌నగర్‌లో మ్యాన్‌హోళ్ల శుభ్రం



మ్యాన్‌హోళ్లను శుభ్రం చేస్తున్న సిబ్బంది

గచ్చిబౌలి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండ్‌నగర్‌లో బోరుబావుల్లో మురికినీరు వస్తున్న ప్రాంతాలను మియాపూర్ మెట్రో వాటర్ వర్క్స్ జనరల్ మేనేజర్ బ్రిజేష్‌కుమార్, డీజీఎం శరత్‌కుమార్, కొండాపూర్ సెక్షన్ మేనేజర్ సందీప్‌కుమార్ పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం, మ్యాన్‌హోల్స్ పగిలిపోయిన వాటికి మరమ్మతులు చేయాలని సిబ్బందిని ఆదేశించడంతో మంగళవారం నుంచి రెండు మ్యాన్‌హోళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. మీగతా మ్యాన్‌హోళ్లను కూడా శుభ్రం చేస్తే డ్రైనేజీ నీరు వెళ్లేది వెళ్లనిది తెలుస్తుందన్నారు. అప్పటి వరకు బోరుబావి నీటిని వాడొద్దని, బయటకు పంపాలని అధికారులు సూచించారు. సమస్యను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు. సమస్య పరిష్కారమయ్యే వరకు తమ సిబ్బంది ఈ ప్రాంతంలోని మ్యాన్‌హోళ్లను క్లీన్ చేస్తారని కాలనీ వాసులకు అధికారులు హామీ ఇచ్చారు.

ముగిసిన విజయదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

మియాపూర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మియాపూర్ హుడా మయూరినగర్ హైటెన్షన్ రోడ్డులోని లక్ష్మీనారాయణ ఎస్టేట్స్‌లోని విజయ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా జరిగిన ఈ వేడుకలు మంగళవారంతో ముగిశాయి. ఈసందర్భంగా అమ్మవారికి కల్యాణ మహోత్సవంతో పాటు ప్రత్యేక పూజలు, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం భక్తుల కోలాహలం మధ్య అమ్మవారిని పల్లకీలో ఊరేగించారు.



వేడుకల్లో పాల్గొన్న ఆలయ ధర్మకర్త కొణిదన కృష్ణారావు, కమిటీ సభ్యులు



అమ్మవారి కల్యాణ మహోత్సవం

బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్‌లో సన్మాన కార్యక్రమం

రాయదుర్గం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి బ్రహ్మకుమారీస్ శాంతిసరోవర్‌లో మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉత్తర్‌ప్రదేశ్ మధురా బృందావనానికి చెందిన మతగురువు ఆచార్య దేవ్‌మురారి బాపుజీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో జరుగుతున్న శివరాత్రి మహోత్సవ వేడుకల్లో భాగంగా శివ పరమాత్మ ధ్వజారోహణ కార్యక్రమంలో కూడా ఆచార్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆచార్య దేవ్‌మురారి మాట్లాడుతూ.. ప్రపంచంలో ఇప్పుడు చాలా అలజడి, అశాంతి వ్యాప్తి చెందిందని, మనుష్యుల్లో వెలితి ఎక్కువ అవుతుందన్నారు. ఆధ్యాత్మిక చింతన, జీవన సరళి దీనికి సరైన పరిష్కారమన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థ బోధనలు, జీవన విధానం గురించి తనకు అవగాహన ఉందని, వివిధ ప్రాంతాల్లో వారి కార్యక్రమాల్లో పాల్గొన్నానని తెలిపారు. కార్యక్రమంలో రాజయోగిని కులదీప్ దీదీ, బీకే అంజలి, చంద్రేశ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మతగురువు ఆచార్య దేవ్‌మురారి బాపుజీ

గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా పేలుడు

- ఒకరికి తీవ్ర గాయాలు



గ్యాస్ రీఫిల్లింగ్ సెంటర్, పేలుడు దాటికి ఎగిరిపడ్డ షట్టర్

హైదర్‌నగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేని గ్యాస్ రీఫిల్లింగ్ సెంటర్లపై నిఘా లేకపోవడంతో ఇష్టారాజ్యాంగా రీఫిల్లింగ్ స్టేషన్‌లు నడుస్తున్నాయి. రాజస్థాన్‌కు చెందిన శంకర్ జగద్గిరిగుట్టలో నివాసం ఉంటూ కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధి వివేకానందనగర్‌డివిజన్ బాగ్ అమీర్‌లోజయ భవాని గోల్డెన్ ఇన్ఫోసిస్టమ్ ఎలక్ట్రికల్ అండ్ గ్యాస్ సర్వీస్ సెంటర్‌ను నిర్వహిస్తున్నా డు. ఈ షాపులో గత ఏడాది నుంచి గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా గ్యాస్ సిలిండర్ రీఫిల్లింగ్ చేస్తు విక్రయాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం గ్యాస్ లీకేజీ అయి ఒక్కసారిగా భారీ పేలుడు జరిగింది. ఈ ఘటనలో శంకర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గృహ అవసరాలకు వాడే సిలిండర్ల నుంచి చిన్నచిన్న వాటిలో అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తుండగా గ్యాస్ లీక్‌అయి ఒక్కసారిగా భారీ శబ్దంతో గ్యాస్ సిలిండ్ పేలుడు సంభవించింది. పేలుడు దాటికి షాప్ షట్టర్ చాలా దూరం వెళ్లిపడటం పేలుడు తీవ్రతకు నిదర్శనం. దీంతో చుట్టు పక్కల వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. మంటల్లో 40 శాతం కాలిన గాయాలతో ఉన్న క్షతగాత్రున్ని గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. జనవాసాల మధ్య ఇటువంటి రీఫిల్లింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

యువకుడి ఆత్మహత్య



ప్రకాశ్ (ఫైల్)

రాయదుర్గం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గచ్చిబౌలిలో నివాసం ఉండే వాసబతుల ప్రకాశ్(35) ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగి. తాను నివాసం ఉంటున్న గదిలో సోమవారం సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అతడి సోదరుడు ప్రకాశ్‌కు ఫోన్ చేసినా స్పందించక పోవడంతో అతడి స్నేహితులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. వారు ప్రకాశ్ రూం తలుపులు బలవంతంగా తీసిచూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతిచెంది ఉన్నాడు. దీంతో వారు గచ్చిబౌలి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల భవనం పైనుంచి పడిన విద్యార్థికి గాయాలు

మియాపూర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): పాఠశాల భవనం పైనుంచి పడిన ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై నర్సింహరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ గోకుల్‌ప్లాట్స్‌కు చెందిన రవికుమార్, వాసంతి దంపతుల కుమారుడు హరీష చంద్ర ప్రసాద్ స్థానికంగా ఓ ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. కాగా సోమవారం పాఠశాల నుంచి ఇంటికి వచ్చే సమయంలో పాఠశాల 5వ అంతస్తు నుంచి కిందపడి తీవ్ర గాయాలకు గురయ్యాడు. దీంతో ఉపాధ్యాయులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. దీనిపై పోలీసులకు ఎవరూ ఫిర్యాదు చేయక పోవడంతో కేసు నమోదు చేయలేదని తెలిపారు.

ఔటర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం

- వ్యక్తి మృతి, ఇద్దరికి గాయాలు

దుండిగల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): దుండిగల్ ఔటర్ రింగ్‌రోడ్డు ఎగ్జిట్-5 దగ్గర జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దుండిగల్ సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం ప్రాంతానికి చెందిన కార్తీక్(38), భార్య సింధు, మూడు సంవత్సరాల కుమారుడితో కలిసి నిజాంపేట్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. సొంత ఊరు ఖమ్మంకు రెండు రోజుల క్రితం వెళ్లాడు. నిజాంపేట్‌కు తన కారులో తిరిగి వస్తున్నాడు. మంగళవారం ఉదయం ఎగ్జిట్-5 వద్దకు రాగానే మేడ్చల్ నుంచి మల్లంపేటకు తన ముందు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనే సమయంలో ఈ ప్రమాదం జరిగింది.

'బుల్లెట్‌పై వచ్చాడని చేతులు నరకడం దుర్మార్గం'

షాపూర్‌నగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని శివగంగ జిల్లాలో ఒక దళిత విద్యార్థి బుల్లెట్ బైక్‌పై కాలేజీకి వచ్చినందుకు అగ్ర వర్ణానికి చెందిన ఓ వ్యక్తి ఓర్వలేక ఆ విద్యార్థి చేతులు నరికిన సంఘటన విచారకరం. కుత్బుల్లాపూర్, సూరారం డివిజన్‌కు చెందిన ప్రముఖ కవి చింతపల్లి బుచ్చయ్య ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. కుల అహంకారాన్ని రూపుమాప లేకపోతున్న ప్రభుత్వాలు ఓట్లకే దళితులను ఉపయోగించుకుని, అఘాయిత్యాలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా ఇటువంటి దుశ్చర్యలను రూపుమాపాలని కోరారు.

అనుమతులిచ్చిన అధికారులే కంచె వేస్తే ఎలా?

- ప్రభుత్వమే తమను కాపాడాలి : ప్రశాంత్‌నగర్ సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రశాంత్‌నగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు

మియాపూర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): వేసుకున్న పంటకు కాపాలాగా కంచెవేస్తే కంచె చేనుమేస్తే రైతు పరిస్థితి ఏమిటో తమ పరిస్థితి కూడా అలానే ఉందని, హుడా అధికారులు పదేపదే తమ కాలనీ వాసులను ఇబ్బంది పెడుతున్న తీరు సామేత చందంగానే ఉందని మియాపూర్‌లోని ప్రశాంత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం ప్రశాంత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

మియాపూర్ ప్రశాంత్‌నగర్‌లో 1993లో మియాపూర్ సర్వేనెంబర్ 100లో 40ఎకరాల భూమిని హుడా అధికారులు ప్రైవేటు భూమిగా పేర్కొంటూ ఆ వెంచర్‌ను లేఔట్ చేసిన వసుద అసోసియేట్ సంస్థకు ప్లాట్లు చేసి ఇంటి నిర్మాణం చేయడానికి అనుమతులు ఇచ్చింది. ఇది మొదటి లేఔట్‌లో అనేకమంది మధ్య, సామాన్య ఉద్యోగులు ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్నారు. అదే భూమికి సంబంధించి మియాపూర్ సర్వే నంబర్ 100లో 20ఎకరాలతో పాటు దాని పక్కనే ఉన్న 92,93,95,97,98 సర్వే నంబర్లలోని 10.30 ఎకరాలకు హుడా అనుమతులు ఇచ్చింది. దీనికి ఈ రెండో లేఔట్‌ను కూడా వసుద అసోసియేట్ సంస్థ హుడా అనుమతి తీసుకొని లేఔట్ చేసింది. మొత్తం 30 ఎకరాలకు ఇంటి నిర్మాణ ప్లాట్లకు అనుమతులు ఇచ్చింది. ఇక్కడ కూడా సామాన్య, మధ్య తరగతి ఉద్యోగులు కొనుగోలు చేశారు. బ్యాంకులోన్లు, దాచుకున్న డబ్బుతో కొంతమంది ఇళ్లు కట్టుకోగా, ఇంకా 70శాతం ప్లాట్స్ ఖాళీగా ఉన్నాయి. వాస్తవానికి సర్వేనంబర్ 100దాని పక్కనే ఉన్న 101లో 552 ఎకరాలకు 2003లో ఈ సర్వే నంబర్లలో ఉన్న సొసైటీల మధ్య వివాదం చోటు చేసుకోవడంతో కోర్టుకు వెళ్లారు. అదే సర్వే నంబర్లు ఈ సర్వే నంబర్ పక్కనే ఉండడంతో సర్వే నంబర్ 100లో హుడా భూమి ఇచ్చిన అనుమతులపై కూడా ఉన్నత న్యాయస్థానం స్టే విధించింది. దీనికితోడు ప్రభుత్వం కూడా 550ఎకరాలు ప్రభుత్వ భూమి అంటూ సొసైటీలపై కేసు వేయడంతో వివాదం పెండింగ్‌లో ఉంది. దీంతో ఖాళీ స్థలాల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టకుండా రెవెన్యూ, హుడా అధికారులు కాపాలాగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆరు నెలల క్రితం ఖాళీగా ఉన్న ఈ భూములపైకి వివిధ ప్రాంతాల నుంచి వేలాదిమంది వచ్చి గుడిసెలు వేసి కబ్జా చేయడానికి ప్రయత్నించడంతో పోలీసులు, అధికారులు వారిని అక్కడి నుంచి పంపించి కేసులు నమోదు చేశారు.

అయితే ఇక్కడ ఖాళీగా ఉన్న 450 ఎకరాల భూమిలో ఎవరూ రాకుండ చుట్టూ హుడా అధికారులు ఫెన్సింగ్ వేశారు. కేవలం 40 ఎకరాలకు మాత్రమే ప్రశాంత్‌నగర్ మొదటి లేఔట్‌కు రెవెన్యూ పంచనామా ఇచ్చిందని, మరో లేఔట్‌కు రెవెన్యూ పంచనామా ఇవ్వలేదనే నేపంతో సామాన్య, మధ్యతరగతి ఉద్యోగుల ప్లాట్లలో ఫెన్సింగ్ వేయడానికి ప్రయత్నించడంతో నెలరోజుల నుంచి హుడా, రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు ఫెన్సింగ్‌ను అడ్డుకున్నారు. దీంతో పాటు తాజాగా మంగళవారం కూడా ఫెన్సింగ్ వేయడాన్ని అడ్డుకోవడంతో కాలనీ వాసులతో పాటు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ హుడా అధికారులను కొనుకున్న ప్లాట్లలో ఫెన్సింగ్ వేయవద్దని సర్దిచెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఇప్పటికైనా తమ ప్లాట్లల్లో ఫెన్సింగ్ వేయొద్దని హుడా అధికారులను కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.

రక్షణ దారులే కబ్జా చేస్తే ఎవరికి చెప్పుకోవాలి?

గచ్చిబౌలి, మార్చి 4(ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి మండలం చందానర్ గ్రామ సర్వే నం.27లోని ప్రభుత్వ భూమిని ఓ సీఐ కబ్జాచేసి నిర్మాణం చేశారని, తక్షన చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి తహసీల్దార్ వెంకారెడ్డికి శేరిలింగంపల్లి జనం కోసం స్వచ్ఛంద సమస్థ అధ్యక్షులు కసిరెడ్డి బాస్కర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ భూములను కాపాడె అధికారి ఇలాంటి చర్యలకు పాల్పడితే ఇక ఎవ్వరికి చెప్పుకోవాలని ఆయన వినతి ప్రతంలో పేర్కొన్నారు. తహసీల్దార్‌గా దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన తహసీల్దార్ వెంకారెడ్డి దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

స్మార్ట్ పోలీసింగ్‌లో స్పెషల్ జ్యూరీ అవార్డు



ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అవార్డు అందుకుంటున్న సీఐ గడ్డం మల్లేష్

జీడిమెట్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ పోలీసింగ్ విభాగంలో జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్ స్పెషల్ జ్యూరీ అవార్డు అందుకున్నారు. ఢిల్లీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేసిన స్మార్ట్ పోలీసింగ్ విభాగంలో దేశవ్యాప్తంగా 129 మంది పాల్గొన్నారు. అందులో సైబర్ క్రైమ్ మేనేజ్‌మెంట్‌లో ప్రతిభ కనబరిచిన గడ్డం మల్లేష్‌కు ఈ అవార్డు అందించారు. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో మల్లేష్ అవార్డు అందుకున్నారు. అవార్డు రావడానికి సహకరించిన తెలంగాణ డీజీపీ డాక్టర్ జితేందర్ ఐపీఎస్, సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఐపీఎస్, బాలానగర్ డీసీపీ కొల్లు సురేష్‌కుమార్ ఐపీఎస్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

దివ్యాంగుల సంక్షేమానికి కమిషనర్‌ను నియమించాలి

జీడిమెట్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సంక్షేమం కోసం స్వయం ప్రతిపత్తి గల ఐఏఎస్ అధికారిని కమిషనర్‌గా నియమించాలని వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ డిజబుల్డ్ సొసైటీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సూరారంకాలనీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2016 ఆర్‌పీడీ చట్టం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దివ్యాంగులకు కేటగిరి వారీగా అధికారులను నియమించి సంక్షేమం కోసం పాటుపడాలని కోరారు. మూడు విభాగాలకు ఒకే అధికారి ఉండటంతో సమస్యలు పరిష్కారం కావడం లేదని తెలిపారు. ప్రభుత్వం కమిషనర్, సహాయ కమిషనర్లను నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంజయ్య గౌడ్, వి.నరేందర్‌రెడ్డి, యాదయ్య యాదవ్, శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

గుంతలను పూడ్చిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నిజాంపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ నల్లపోచమ్మ గుడి రహదారి కల్వర్టు వద్ద తవ్వకాలు చేపట్టి మరమ్మతులు మరిచారు అనే శీర్షికన గత నెల 13న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గుంతలు పడిన రోడ్డులో నిత్యం జరుగుతున్న ప్రమాదాలపై కూడా స్థానికులు పలుమార్లు ఫిర్యాదు చేయడం వంటి కారణాలతో మంగళవారం ప్యాచ్‌వర్క్‌లు చేశారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు.


గుంతలు పడిన రోడ్డుకు మరమ్మతులు చేసిన అధికారులు

శుభాకాంక్షలు



ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఉపాధ్యాయుల ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి మల్క కొమరయ్య ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ అసెంబ్లీ బీజేపీ కో-కన్వీనర్ పొత్తూరి శివాజీరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు రాజిరెడ్డి కొంపల్లి మున్సిపల్ పట్టణ అధ్యక్షులు సతీష్‌సాగర్ కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.
- పేట్‌బషీరాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి)



ఇంటి పన్ను చెల్లించిన మాజీ కార్పొరేటర్

ఇంటి పన్ను రూ.4,19,081 చెక్కును మంగళవారం కమిషనర్ సాబేరు అలీకి అందజేస్తున్న నిజాంపేట్ మాజీ కార్పొరేటర్ మేకల వెంకటేష్.
- దుండిగల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి)



సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు

మహిళల సమస్యలపై అవగాహన

షాపూర్‌నగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీనగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో మహిళాసంఘం సభ్యులతో సఖి-2 మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీం సభ్యులు సఖి సర్వీసెస్ గురించి టీచర్లకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా మహిళలకు ఎదురయ్యే లైంగిక, వరకట్న వేధింపులపై వివరించారు. ఇలాంటివి జరిగితే ఉమెన్ హెల్ప్ 181ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సఖి ఇన్‌చార్జి వెంకటలక్ష్మి, కేస్ వర్కర్ లావణ్య, టీచర్ భాగ్యలక్ష్మితో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

బుల్లెట్‌పై వచ్చాడని చేతులు నరకడం దుర్మార్గం

షాపూర్‌నగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని శివగంగ జిల్లాలో ఒక దళిత విద్యార్థి బుల్లెట్ బండిపై కాలేజీకి వచ్చినందుకు అగ్ర వర్ణానికి చెందిన వ్యక్తి ఓర్వలేక ఆ విద్యార్థి చేతులు నరికిన సంఘటన జరగడం విచారకరం. కుత్బుల్లాపూర్, సూరారం డివిజన్‌కు చెందిన ప్రముఖకవి చింతపల్లి బుచ్చయ్య ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు. కుల అహంకారాన్ని రూపుమాపలేకపోతున్న ప్రభుత్వాలు ఓట్లకే దళితులను ఉపయోగించుకుని, అఘాయిత్యాలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. ఇప్పటికైనా ఇటువంటి దుశ్చర్యలను రూపుమాపాలని కోరారు.

ప్రమాదాలకు అడ్డా.. ఈ చౌరస్తా

- మహదేవపురం చౌరస్తాలో నిత్యం ప్రమాదాలే
- నెలకు సుమారు 8 నుంచి 10 ఘటనలు
- పట్టించుకోని అధికారులు


సిగ్నల్ లేని మహదేవపురం చౌరస్తా

గాజులరామారం, మార్చి 4(ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే చౌరస్తాలో అధికారులు ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయడంలో అలసత్వం వహిస్తున్నారు. గాజులరామారం డివిజన్‌లోని మహదేవపురం చౌరస్తా ప్రమాదాలకు నిలయంగా మారింది. ఉదయం, సాయంత్రం సమయాల్లో వాహనాల రద్దీ కిలో మీటరు మేర ఉంటుంది. ఈ ట్రాఫిక్‌ను దాటేందుకు గంటలు సమయం పడుతోందని వాహనదారులు తెలుపుతున్నారు. ఈ చౌరస్తాలో సిగ్నల్స్‌ను ఏర్పాటు చేయాలని నాయకులకు, అధికారులకు ప్రజావాణిలో స్థానిక సంక్షేమ సంఘం సభ్యులు వినతిపత్రాలు అందజేసినా ప్రయోజనం లేకుండా పోతుందని తెలుపుతున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్లను నిర్మించకపోవడం, ఉన్న రోడ్లలో వాహనదారులు వెళ్లేందుకు సరిపోక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ చౌరస్తాలో అనేక ప్రమాదాలు చోటు చేసుకొని ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై ఆస్పత్రిలో పాలైన సందర్భాలు ఎన్నో ఉన్నాయని మహదేవపురం కాలనీ వాసులు తెలుపుతున్నారు. నెలలో 8 నుంచి 10 ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా ఎవరికీ అధికారులకు పట్టడం లేదు.

కనిపించని స్పీడ్ బ్రేకర్లు

రోడ్డుపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు అధికారులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయలేదు. దీంతో ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో అధికారులు ఈ చౌరస్తాలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు హామీ అమలుకు నోచుకోలేదని స్థానికులు తెలుపుతున్నారు.

సిగ్నల్స్ ఏర్పాటులో జాప్యం

ఈ చౌరస్తాలో జరుగుతున్న ప్రమాదాలను గుర్తించిన అధికారులు సిగ్నల్ ఏర్పాటుకు పర్యటించి వెళ్లారు. దానికయ్యే ఖర్చును అంచనా వేసి, హద్దులు కూడా ఏర్పాటు చేసి సంవత్సరాలు గడుస్తున్నా నేటికి పనులు మాత్రం మొదలుపెట్టలేదు. అధికారులకు ఫిర్యాదు చేసినప్పుడే స్పందిస్తున్నారని స్థానికులు, వాహనదారులు తెలుపుతున్నారు. చుట్టుపక్కల 10 నుంచి 15 వరకు బస్తీలు ఏర్పడటంతో వాహనాలు అధికంగా రాకపోకలు సాగిస్తుంటాయి. సిగ్నల్స్ లేకపోవడంతో వాహనదారులు తమ ఇష్టం వచ్చినట్లు వేగంగా నడుపుతూ ఇతరులకు ఇబ్బంది కలిగించడమే కాకుండా ప్రమాదాలకు కారణం అవుతున్నారని తెలుపుతున్నారు.

సిగ్నల్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది



మహదేవపురం, దేవేందర్‌నగర్, గాజులరామారం చౌరస్తాల్లో అధికారులు సిగ్నల్స్ ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరగకుండా అరికట్టవచ్చు. ఉదయం, సాయంత్ర సమయాల్లో ఎక్కువగా వాహనాలు రోడ్డుపైకి వస్తుంటాయి.
- దుగ్యాల ప్రసాద్, మహదేవపురం

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు



ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఇంతవరకు మహదేవపురం చౌరస్తాలో సిగ్నల్ ఏర్పాటు చేయడం లేదు. ఈ చౌరస్తాకు నాలుగు దిక్కుల నుంచి వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ సిగ్నల్ ఏర్పాటు చేయకపోయినా ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ సిబ్బందిని నియమించాలి.
- జగదీశ్వర్‌రెడ్డి, స్థానికుడు

సిగ్నల్స్‌ను ఏర్పాటు చేస్తా



ఈ చౌరస్తాలో సిగ్నల్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధంగా ఉంది. కాకపోతే రోడ్డు వెడల్పు కోసం ఆగుతున్నాం. ఈ మధ్య కాలంలో సగం రోడ్డులో అధికారులు పూర్తి చేశారు. ఆ పూర్తి చేసిన రోడ్డులో నూతన రోడ్డును నిర్మిస్తే, నిర్మించిన వెంటనే సిగ్నల్ ఏర్పాటు చేస్తాం.
- శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ, జీడిమెట్ల

నత్తనడకన బ్రిడ్జి పనులు

- ఇబ్బందుల్లో వాహనదారులు


నిర్మాణదశలో ఉన్న బ్రిడ్జి పనులు

కుత్బుల్లాపూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : అధికారుల నిఘా లోపం, కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం వెరసి ప్రజల పాలిట శాపంలా మారింది. గాజులరామారం సర్కిల్, చింతల్ డివిజన్ పరిధిలోని షాపూర్‌నగర్ నుంచి జగద్గిరిగుట్టకు వెళ్లే పైప్‌లైన్ రోడ్డులో కొన్ని సంవత్సరాల క్రితం అప్పటి జనాభాకు అనుగుణంగా చిన్న రోడ్డు ఉండేది. అయితే న్యూ ఎల్బీనగర్, రోడామేస్త్రీనగర్, శ్రీనివాసనగర్, వివేకానందనగర్ తదితర కాలనీల నుంచి మురుగునీరు, వరద నీరు వెళ్లేందుకు పైప్‌లైన్ రోడ్డు మధ్యలో చిన్న కల్వర్టును నిర్మించారు.


మట్టిరోడ్డులో దుమ్ములోనే వెళ్తున్న వాహనదారులు

అయితే ప్రస్తుతం పెరిగిన జనాభాతో పాటు వాహనాలు పెరగడంతో రోడ్డును విస్తరించారు. కానీ వరద నీరు వెళ్లేందుకు కల్వర్టును పెద్దగా నిర్మించకపోవడంతో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రజల సౌకర్యార్థం పెద్ద బ్రిడ్జి నిర్మాణానికి అధికారులు, పాలకులు శ్రీకారం చుట్టి పనులను ప్రారంభించారు. ఈ నిర్మాణ సమయంలో రాకపోకలకు హెచ్ఎంటీ ఖాళీస్థలం నుంచి సాధారణ మట్టిరోడ్డును వేశారు. సంవత్సరం కావస్తున్నా పనులు కొనసాగుతూనే ఉన్నాయని, పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయినప్పటికీ బీటీ వేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో మట్టిరోడ్డులో వెళ్లడం వల్ల దుమ్ము ధూళితో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ప్రతి పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్

పేట్‌బషీరాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): మార్చి 5 నుంచి 25వరకు జరగనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లను చేశామని జిల్లా విద్యాధికారి ఎం. కిషన్ తెలిపారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని మూడు మండలాలు బాచుపల్లి, గండిమైసమ్మ దుండిగల్, కుత్బుల్లాపూర్‌లో 44 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష సెంటర్‌కు విద్యార్థులు అయిదు నిమిషాల ముందుగానే చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, గాలి, వెలుతురు ఉండేలా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఆయన పేర్కొన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు నిఘా పెట్టామని అన్నారు. ఈ ఏడాది ఒక్క నిమిషం ఆలస్యాన్ని ఎత్తివేశామని ఇంటర్ బోర్డు ప్రకటించిందని, కానీ ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. మేడ్చల్ జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు మొత్తం 64,107మంది, రెండవ సంవత్సరం విద్యార్థులు 62,316మంది పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు.

ఇన్విజిలేటర్లకు అవగాహన

కుత్బుల్లాపూర్‌లో ఇన్‌విజిలేటర్లకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు ఉన్నాయా? లేదా అనేది చూడాలని, నిర్వహణపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనే దానిపై పరీక్షల నిర్వాహణ అధికారి పిడమర్తి ఉపేందర్ అవగాహన కల్పించారు.



జీడిమెట్ల డిపో ముందు నిరసన తెలుపుతున్న ఆర్టీసి కార్మికులు

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి : జేఏసీ

జీడిమెట్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసి కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని, తక్షణమే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని జేఏసీ డిమాండ్ చేసింది. మంగళవారం జీడిమెట్ల డిపో ఆవరణలో రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. తక్షణమే ఆర్టీసి విలీనం, పే స్కేల్, ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేసి ఆర్టీసికి ఇవ్వాలన్నారు. కార్మికులకు పనిభారం తగ్గించాలని, యూనియన్లను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ కమలాకర్ గౌడ్, కన్వీనర్ ఎండీ మౌలానా, కో కన్వీనర్ కత్తుల యాదయ్య, కేఎస్.పాల్, సీఎం.కృష్ణ, గోవర్ధన్, హరికిషన్, జ్ఞానేశ్వర్, అశోక్, వల్లూరి బాబు పాల్గొన్నారు.

ఈఎస్ఐ డిస్పెన్సరీలో మందుల కొరత


జీడిమెట్ల ఈఎస్ఐ డిస్పెన్సరీ


మందుల కోసం క్యూలో నిల్చున్న రోగులు

- సిబ్బంది లేక రోగుల ఇబ్బందులు

కుత్బుల్లాపూర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : నగర శివారు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్‌నగర్‌లో ఈఎస్ఐ డిస్పెన్సరీని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇది పారిశ్రామికవాడకు దగ్గర కావడంతో రోజుకు సుమారు వెయ్యి నుంచి పన్నెండు వందలమంది రోగులు చికిత్సలు, మందుల కోసం ఇక్కడికి వస్తుంటారు.

ఇక్కడ వైద్యం చేసే డాక్టర్లు, మందులు కూడా అందుబాటులో ఉండటం లేదని రోగులు తెలుపుతున్నారు. ప్రతి సోమ, మంగళ, శుక్రవారాల్లో రోగులు అధికంగా ఇక్కడికి వస్తుంటారు. ఈ డిస్పెన్సరీకి గత 30 సంవత్సరాల క్రితం లెక్కల ప్రకారం పదిమంది డాక్టర్లు అవసరం ఉండగా కేవలం ఐదుగురు మాత్రమే వైద్య సేవలను అందిస్తున్నారు. సిబ్బంది 70మంది అవసరమైతే, 55మందితోనే సరిపెడుతున్నారు. ప్రస్తుతం మూడు రెట్లు రోగులు పెరిగినా, పాత లెక్కల ప్రకారం కూడా వైద్యులు, సిబ్బంది లేకపోవడం శోచనీయం. మందులు కూడా అంతంత మాత్రంగానే ప్రభుత్వం పంపిస్తుందని సమాచారం. ఉదాహరణకు షుగర్ రోగికి నాలుగు రకాల మందులు అవసరమవుతాయి. కానీ రెండు రకాలను మాత్రమే ఇస్తున్నారని, మిగతా మందులను బయట కొనుగోలు చేస్తున్నామని పేరు చెప్పేందుకు ఇష్టపడని రోగులు తెలుపుతున్నారు.

అలాగే బీపీకి కూడా మూడు రకాల మందులకు బదులుగా రెండు రకాలనే ఇస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. సిబ్బంది సరిగా లేకపోవడంతో మందులు ఇచ్చే కౌంటర్ వద్ద రోగులు పెద్ద ఎత్తున క్యూ కడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి డాక్టర్లు, సిబ్బంది కొరతను తీర్చాలని, రోగులకు తగినట్లుగా మందులు వచ్చేలా చూడాలని రోగులు కోరుతున్నారు.

సస్పెన్షన్‌పై టీడీపీకి ఎలాంటి సంబంధం లేదు


టీడీపీ జాతీయ ప్రచార కార్యదర్శి దశరథ్

షాపూర్‌నగర్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): సోమవారం ఆంధ్ర రాష్ట్రంలో ఐపీఎస్ అధికారి, సీఐడీ చీఫ్ పీవీ సునీల్ కుమార్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు. అది కేవలం పాలనా యంత్రాంగం తీసుకొన్న చర్య మాత్రమే. దీనిని ఆసరాగా చేసుకుని ప్రభుత్వాన్ని నిందించేలా కొందరు టీడీపీ చేసిందనడం ఎంతవరకు సమంజసమని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రచార కార్యదర్శి జె.దశరథ్ విలేకరుల సమావేశంలో మండిపడ్డారు. మంగళవారం షాపూర్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొందరు ఆ అధికారికి కులం కార్డు తగిలించి రాజకీయ లబ్ధి కోసం చవకబారు ప్రకటనలతో పార్టీని అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బలహీన వర్గాలకు చెందిన అనేకమందిపై అధికారం ఉందని కేవలం దళితులను టార్గెట్ చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ఇష్టారాజ్యంగా అధికారులను ఉపయోగించుకొని వారికి నచ్చని ప్రతిపక్ష నేతలు, అధికారులు, సామాన్య ప్రజలపై అక్రమ కేసులు పెట్టింది గుర్తులేదా అన్నారు. అక్రమ కేసులపై టీడీపీ బాధ్యతాయుతంగా పోరాడిన విషయం ప్రజలందరికి తెలుసన్నారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తాం

- రెండు ఫీడర్లను ప్రారంభించిన ఎస్ఈ, డీఈలు

పేట్‌బషీరాబాద్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): విద్యుత్ అంతరాయం కలుగకుండా అన్ని చర్యలు తీసుకునేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని ఎస్ఈ రవికుమార్ అన్నారు. కొంపల్లి పురపాలకసంఘంలోని దూలపల్లి సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన రెండు ఫీడర్లను మంగళవారం మేడ్చల్ డీఈ రాజుజాన్ పోతరాజుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఫీడర్లతో విద్యుత్ మెరుగుపడుతుందని, సబ్‌స్టేషన్‌పై అధికలోడు పడుతుండటం వల్ల వీటిని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్‌కు సంబంధించి ఏ చిన్న సమస్య ఉన్నా తమ సిబ్బందికి తెలియజేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్ఈని, డీఈలను దూలపల్లి ఇండస్ట్రియల్ అసోసియేషన్ సభ్యులు పూలబొకేను అందజేసి శాలువాతో సన్మానించి, మొక్కను అందజేశారు.

విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి అక్కడే పడవేయడం వల్ల వేసవికాలంలో ఏదైనా నిప్పురవ్వ పడితే పెనుప్రమాదం సంభవించే అవకాశం ఉందని అన్నారు. కాబట్టి చెట్లకొమ్మలను నరికిన వెంటనే తొలగించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ శ్రీకాంత్, ఏఈ శ్రీనివాస్‌లు, లైన్ టీమ్ ఆఫీసర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఫలితాలపై సమీక్షించుకోవాలి

జీడిమెట్ల, మార్చి 4(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ముఖ్యమంత్రి సమీక్షించుకోవాలని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ కోరారు. జగద్గిరిగుట్ట మగ్దూంనగర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో అధికారంలో ఎవరు ఉంటే వారికి అనుకూలంగా ఫలితాలు వచ్చేవని, దీనికి విరుద్ధంగా ప్రతిపక్షాలు గెలుచుకోవడం ప్రజల్లో వస్తున్న మార్పు చూపిస్తుందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ఓల్డ్ పెన్షన్ స్కీం హామీపై సీఎం మాట్లాడకపోవడం వల్ల ఉపాధ్యాయులు నేడు తిరస్కరించారన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. గతంలో ఉన్న బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు పెద్ద తేడా లేదని ప్రజలు భావిస్తున్నారని, దీంతో బీజేపీ బలపడే అవకాశాలున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ కార్యవర్గ సభ్యులు హరినాథ్‌రావు, శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యులు సామెల్, రవి,ముసలయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

ఔటర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- వ్యక్తి మృతి, ఇద్దరికి గాయాలు

దుండిగల్, మార్చి 4(ఆంధ్రజ్యోతి): దుండిగల్ ఔటర్ రింగ్‌రోడ్డు ఎగ్జిట్-5 దగ్గర జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా, మరో ఇద్దరు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దుండిగల్ సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం ప్రాంతానికి చెందిన కార్తీక్(38), భార్య సింధు, మూడు సంవత్సరాల కుమారునితో కలిసి నిజాంపేట్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. సొంత ఊరు ఖమ్మంకు రెండు రోజుల క్రితం వెళ్లాడు. నిజాంపేట్‌కు తన కారులో తిరిగి వస్తున్నాడు. మంగళవారం ఉదయం 7 గంటల 40 నిమిషాల ప్రాంతంలో ఎగ్జిట్-5 వద్దకు రాగానే మేడ్చల్ నుంచి మల్లంపేటకు తన ముందు వెళుతున్న డీసీఎం వాహనాన్ని వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న కార్తీక్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. భార్య, కుమారుడికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న దుండిగల్ పోలీసులు గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం యశోద ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి ప్రాణాపాయం లేదని పోలీసులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. మరో పది నిమిషాల్లో ఇంటికి చేరుకుంటారనే సమయంలో ఈ ప్రమాదం జరిగింది.


ప్రమాదంలో నుజ్జయిన కారు